# భారత దేశంలో భర్త!

పి. కుసుమ కుమారి

ఇష్టంలేని పని చెయ్యవలసి రావడంకంటె కష్టమేముండాలి నావంటి వాడికి? అర్జంటుగా తిరుపతి వెళ్ళమని ఆఫీసువారి తాఖీదు. రిజర్వేషను చేయించుకుందుకయినా వ్యవధి లేదు. పైగా—"తిరుపతయితే నేనూ వొస్తా. మొక్కుందిౘ" అంటూ వెంటపడింది బామ్మ. ముసలివాళ్ళతో— ఆడ ముసలివాళ్ళతో ప్రయాణమంటే యిక చెప్పేదేముంది? అందులోనూ యీ బామ్మ మామూలు బామ్మకాదు. నన్ను పెళ్ళిచేసుకోమని అస్తమానూ పో(బో)రుతుంది. మన కన్నె త్తెయ్యాలని తన సంబరమేకాని పెళ్ళిచేసుకుంటే నేనెన్ని బాధలూ కష్టాలూ పడాలో ఆవిడ ఆలోచించదు. చెప్పినా వినదు. ఆవిడ కిష్టంలేని మాటలు చెబుతూంటే చెముడొచ్చేస్తుంది. తనకి కావలసినవి మాత్రం వినపడతాయి. తీన్నే బామ్మ చెముడంటాను.

పోర్టరుకి లంచమిచ్చి రైలులో సీట్లు సంపాదించి పెట్టమన్నాను—టుటయ్యర్, త్రీటయ్యర్ల ఆశ పూర్తిగా చచ్చిపోయాక. పోర్టరు చాకచక్యం కానివ్వండి, దబాయింపు కానివ్వండి జనరల్ కంపార్టుమెంటులో మాకు సీట్లు దొరికాయి! నాకూ బామ్మకీ ఎదురెదురుగానే!

"దేముణ్ని నమ్మనంటావు, తిరపతి వెంకన్న దయ కాకపోతే యింత రష్టు రష్)లో మనకి సీట్లు దొరకడమేమిటి? తిరపతి వెంకన్న తలుచుకుంటే జరగనిదుండదు...." అంది బామ్మ సీటులో కూర్చుని మూటలు బల్లకింద సర్దుతూ,

"తిరపతి వెంకన్న దయకాదు, పోర్టరు ఘనత. వాడికి నేనిచ్చిన లంచం...."

నా మాటలు ఆవిడ వినిపించుకోలేదు. పక్కనకూర్చున్న శాస్త్రిని కదిపింది. "ఎంత వరకూ నాయనా?"

"వచ్చే స్టేషనే అండీ. టెన్నిస్ పోటీలున్నాయి........" పొరపాటున చెప్పి ఉంటాడు ఆ విషయం అతను.

"నువ్వు-టెన్నిసాడుతావా నాయనా!" బోలెడంత ఆశ్చర్యమూ ఆనందమూ పడిపోతూ సీటు కడ్డంతిరిగి అతన్ని అప్యాయంగా చూసింది బామ్మ ఆత్మ బంధువుని మల్లె. "వారూ యింతే. ఎప్పుడూ టెన్నిసంటూ ఊళ్ళుపట్టుకు తిరిగేవారు. మహా బాగా ఆడేవారు. అందుకే స్నేహితులు ఆయనని యింటి పట్టున ఉండనిచ్చేవారు కాదు. బయటకు వెళ్ళారంటే చాలు ఓ కప్పో మెడలో పట్టుకొచ్చారన్న మాటే. భోషాణం నిండిపోయింది - వారు పట్టుకొచ్చిన కప్పులతోటీ మెడల్సులతోటీ. అసలు సిసలయిన వెండివి...."

వింటున్న నేను విభ్రాంతుడినయ్యాను. తాతగారంతటి ఘన టెన్నిస్ ప్లేయరా! వారిపేరే నాదీను. నాకు రాకెట్ పట్టుకోడమే రాదేం? పోనీ....ఇంట్లో మచ్చుకో కప్పూ మెడలూ అయినా మిగలలేదేం?

రైలాగింది. టెన్నిస్ ప్లేయరు రాకెట్ తీసుకుని దిగిపోతే—ఎవరో భావకవిలాటి శాస్త్రి వచ్చి బామ్మ పక్కన కూర్చున్నాడు. రైలు కదలడమేమిటి, అతను కూనిరాగం తీయసాగాడు. కొందరంతే. రైలెక్కితే

హాస్యకథల పోటీలో



ఎన్నికయిన కథ

చాలు గొంతు విప్పేస్తారు. ఇంట్లో పాడు కుందుకు అవకాశ ముండదనుకుంటాను వారికి.

"బాగానే ఉంది కంఠం. గట్టిగా పాడు నాయనా ..."

"రైల్లో ఏం పాటలెండి... " సిగ్గుపడి పోయాడతను.

"అయ్యో! పాట కటువంటి పట్టింపు లుండకూడదు. వారి కెలాంటి సంకోచాలూ సందేహాలూ ఉండేవి కావు. జండాపై కపి రాజు అందుకున్నారో—కళ్ళముందు కదన రంగం కదలవలసిందే. మేఘ మల్హార్ ఆల పించి చినుకులు కురిపిస్తే—దీపకరాగం పాడి దీపాలు వెలిగించమన్నారుట. సరే నన్నా రీయన ఎంత విద్వత్తు లేకపోతే సాక్షాత్తూ పిఠాపురంరాజావారు తన మెడలో పచ్చల హారంతీసి వీరి మెడలో వేసి మెచ్చుకోలుగా నవ్వుతారు?" బోసినోటితో నవ్వింది బామ్మ.

అతలి సంగతెమోకాని నాకు మతిపో యింది. తాతగారింతటి సంగీత విద్వాం సులా? పిఠాపురం రాజావారిచ్చిన పచ్చల హారంలో ముచ్చుకొక్క పచ్చయినా మిగల లేదేం యింట్లో?

"వారి పేరేమిటి బామ్మగారూ?" అడి గాడు పాటగాడు కుతూహలంగా.

"భార్య—భర్త పేరు చెప్పవచ్చునా?" అనేసింది బామ్మ.


నేను ఆలోచిస్తున్నాను. సంగీతం వంటి లలిత కళలు వంశ పారంపర్యా వస్తూంటా యంటారు. తాతగారింతటి సంగీత సామ్రా ట్టులు కాగా—మా నాన్నకి కానీ నాకు కానీ బాత్‌రూమ్ హమ్మింగయినారాలేదేం? రైలు పరుగెడుతుంది. ఏదో స్టేషనువస్తే ఆగింది. ఈసారి బామ్మ పక్కసీటులోకి తమాషా అయిన ఆసామీ వచ్చాడు. ఇనప గుండులా ఉన్నాడు. ఆ గుండ్రపాటి మని షిని చూస్తూంటే నవ్వొస్తూంది.

"కుస్తీ పోటీలకా?" అడగనే అడిగింది బామ్మ.

"పోటీలకు కాదుకానీ అటువంటి పని మీదేలెండి. మీరెలా కనుక్కున్నారూ?" ముఖమంతా ఆశ్చర్యం చేసుకని అడిగాడు వస్తాదు.

బామ్మ ఆలవోకగా నవ్వింది. "వారు బతికిన రోజుల్లో పెరడంతా వస్తాదులే కాదూ? పెరట్లో యిసక పోయించనూ కోడె మ సింగాల మాదిరి కుస్తీలు పట్టనూ, రోజంతా అదే కదా? ఆ మహారాజు తన దగ్గరకి విద్య నేర్చు కుందుకు వచ్చిన వారికి నేర్పకుండా పంపేవారు కాదు. వారి మట్టుకు వారు—ఎలా ఉండేవారని? అజాను బాహుడు. గుండెమీద కండల్లో పులిగోరు పతకం కనపడేదికాదు పట్టి పట్టి వెదికితే తప్ప. ఆ కంఠమో? పిడుగులు పడ్డట్లే. జబ్బ చరిచి హుంకరించారంటే—ఎదుటివాడు అబ్బా అనవలసిందే. వారిని కట్టుకుని కాపురం చేసిన యిల్లాలినా? పరాకున చూస్తే నేనే బెదిరి పడేదాన్ని. అటువంటి విగ్రహం. ఓసారిటు కోడి రామ్మూర్తి.... కొత్త పట్టు పట్టి ఓ సారితని కుయికుక్క మనిపించారుట... " ఒకపట్టాన తేరుకోలేక పోయాను. నేను విన్నది—బామ్మ చెప్పింది నిజంగా నిజమేనా? తాతగారు—కోడి రామ మూర్తినే కుయికుక్క మనిపించగలిగినంతటి ఘనమైన కాటా కుస్తీ వస్తాదా? గుండెల కండలలో బంగారు పతకమే కనిపించేది కాదూ? మరి—నాన్నగరూ, నేనూ ఎందు కని ఎండు నక్కలలా ఒక్క ప్రాణులలా ఉన్నాం? ఇక్కడ జనటిక్స్ (జన్యుశాస్త్రం) ఫెయిలయిపోయిందా? ఓ మోస్తరు పర్స నాలిటీ యినా రాలేదేం మాకు? మందు (బలవర్ధక టానిక్ ....వాడి చూడుడు. ఒక పౌను మందు తిన్నాక మీ శరీరం బరువు చక్కగా పెరుగును. పథ్యములేదు) వాడక మునుపు అంటూ వేసే నీరసాకార బొమ్మ ల్లా, ఒక్క ప్రాణుల్లా ఉండిపోయామేం మేము, తాతగారంత దుక్కగా ఉండినట్ల యితే?

"ఆ మహారాజు పేరేమిటవ్వగారూ?"




శ్రద్ధగా అడిగాడు వస్తాను.

"కులసతి పతిపేరు చెప్పవొచ్చునా? నేరం కాదూ? పాపం కాదూ?"

రైలు వేగం తగ్గించుకుంటూంది. నేను డోరుదగ్గరికి దారి వెతుక్కున్నాను. నేను కాఫీగతప్రాణిని. బామ్మకి మడీ ఆచారమూ పుష్కలం కనుక ఆవిడ మంచినీళ్ళయినా తాగదు రైల్లో. రైల్లో ఉండగా ఏ ద్వాదశో వచ్చిందో - ప్లాట్ ఫారంమీద చుట్టూ బట్ట కట్టేసి-వంట వండేసి-బ్రాహ్మడికి భోజనం పెట్టేస్తుంది. అంత నిష్ఠా, నియమమూనూ.

కాఫీ తాగి సిగరెట్ కాల్చుకుని పెట్టెలోకి వచ్చాను. ఈసారి బామ్మపక్కన తెలుగు మాస్టారివంటి ఆకారం కూర్చుని వుంది.

"కవిత్వం చెప్పేవాడివా బాబూ? అడిగానని ఏమీ అనుకోకు ఆ వుంచేగట్టూ కండువా వాటమూ చూస్తే అలా అనిపించింది."

"అనుకునేందుకేముందండీ? పెద్దవారు. మీ నోటి దీవెన ఫలిస్తే అదృష్టవంతుడినే. ప్రయత్నించగా పాండిత్యం పట్టుబడింది కాని కవిత్వం చేరువ కావటంలేదండీ"

అన్నాడతను ఎంతో దిగులు పడిపోతూ. అతని గొంతులో నిరాశా నిస్పృహా.

"పాండిత్యం దారి వేరూ, కవిత్వందారి వేరూ. కవిత్వం సహజంగా అబ్బవలసిందే సరస్వతీ కటాక్షంగా. వసంతం వచ్చేసరికి కోయిల కూత పట్టినట్టు రావాలి కవిత్వమంటే. ఆ మహానుభావు డేమంత చదివారని? కాని-పంచరత్నాలయినా ఆయనే రాయాలి, పదాలయినా ఆయనే అల్లాలి. అంతెందుకు? నేను కొత్త చీర చుట్టుకున్నానో, ఆయన నామీదా నా చీరమీదా వర్షంలా పద్యాలు కురిపించేవారు. ఓసారి ఆవడలు చేశాను. అవంటే వారికి మహా ప్రీతి ఆవేళ అవి మహా భేషుగ్గా కుదిరాయి. దానితో-ఆవడ నోటిలో పెట్టుకున్నారో లేదో ఐదు పద్యాలు చెప్పేరు ఆశువుగా"—"కవిత్వమంటే అదీ!" అని ముక్తాయింపు పలికింది బామ్మ.

"ఔను బామ్మగారూ... కవిత్వమంటే అలా ధారాపాతంగానే రావాలి. వారి నామధేయం సెలవివ్వండి. రోజూ తలచుకుంటాను అలాగయినా నేను కవిని కాగలుగుతానేమో...."

"భర్తపేరు చెప్పడం ధర్మశాస్త్రం కొప్పదే...."

నాకు మతిపోయింది. తాతగారంతటి మహాకవులయితే ఇంట్లో ఒక్క గ్రంథమూ లేదేం వారు రచించినది? కవిత్వం-మా కబ్బ లేదేం? కావ్యాలమాట దేముడెరుగు, కనీసం మినీ కథయినా వ్రాయలేదే నేను! నాకో నాన్నకో కవిత్వపు వాసన తాతగారినుంచి ఎందుకు సంక్రమించలేదు? బామ్మ నేఅడగా లి తిరకాసేమిటో. అసలీతాతగా రేమిటి? నవలా హీరోకంటె కూడా సకల లక్షణ సమన్వితులై విరాజిల్లుతున్నారు? ఆయనలో లేని గొప్పతనం కనిపించడంలేదు. కవిత్వంలాటి లలిత కళలకీ, కుస్తీలాటి అలలిత కళలకీ కూడా నిలయమై పోయారు త్రంగా! ఇది సాధ్యమేనా? సత్యమేనా?

స్టేషనులో రైలాగింది ఇది-మీల్స్ స్టేషన్ దగ్గరగా అరగంటాగుతుంది రైలుదిగి.... భోజనమూ, కిళ్ళీ, సిగరెట్టూ వగైరా కార్యక్రమాలు పూర్తి చేసుకని యీసారి బామ్మ పక్కసీటు కెటువంటి వాడు వస్తాడో అనకుంటూ పెట్టెలోకి-సీటు దగ్గరికి వచ్చాను.

బామ్మ కంఠం కంగుమంటూంది "ఈ మాత్రం దానికి పొరుగూరు వెళ్ళి తగు మనుషులని తెచ్చుకోవాలా? ఊరు గొడ్డు పోయిందా? ఆ మహారాజు తెల్లారి లేస్తే తొంభయి తగవులు తీర్చేవారు. ఆలుమగల తగవే కానిండి.... అన్నదమ్ముల గొడవే కానిండి... ఆస్తి పంపకాలే అవనీండి. నోటి కొచ్చిన కూత కూయడం కాదే, తగువు విప్పారంటే తరతరాలుకి మళ్ళీ తలెత్తడమే? ఎటువంటి గడ్డు పరిస్థితయినా చిటికెలో విడగొట్టేసేవారు కాదూ? ముఖం గంటు పెట్టుకుని వచ్చినవాళ్ళు ముసి ముసి నవ్వులు నవ్వుతూ వెళ్ళవలసిందే. వారున్నంత కాలమూ అటు పాతిక గ్రామాలూ యిటు పాతిక గ్రామాలూ కోరటు కెళ్ళడం ఎరుగుదురా? ఆయనొక్కరే పది కోరటులూ వంద జడ్జీలూ పెట్టుగా ఉండేవారు-" —"మళ్ళీ అయనేమన్నా ధర్మశాస్త్రాలు చదివారనా యింగిలీసు పుస్తకాలు చదివారనా? వివేకంనాయనా....వివేకం "

తాతగారి టోపీలో మరో తురాయి! ఆయన-కొమ్ములు తిరిగిన తగు మనిషి. ఉన్నచోట కోర్టులక్కర లేదు. తాతగారంటే-డేనియల్ కమ్స్టటు జడ్జిమెంట్. బాగానే ఉంది కాని-ఒక్కమనిషి యిన్ని రంగాలలో యిలా సాటిలేని మేటి కావడం సాధ్యమేనా? మా నాన్నగారూ, నేనూ తాతగారి వంశంలో తప్పబుట్టామా? ఒక్క మంచి లక్షణమూ మాకు రాలేదేం? ఆలోస్తూంటే నాకు నిద్ర వచ్చేసింది. నిద్రపడితే ను మనిషిని కాను. వొళ్ళెరక్కుండా పడుకుంటాను, మెలకువనేది ఎప్పుడో దానిష్టం వచ్చినప్పుడు రావలసిందే అది నా అధీనంలో ఉండదు.

నేను మేలుకునే సరికి.... తిరుపతి దగ్గర పడుతూంది. మరొకటో రెండో స్టేషన్లు. అంతే. బామ్మ సీటువేపు చూశాను. దృష్టి మరల్చుకోలేక పోయాను. బామ్మ పక్కన ఓ బంగారు బొమ్మ. ఆమె పక్కన ఓ పెద్దమనిషి-ఎందుకో ముఖం వేలాడేసుకుని. బామ్మ అతన్నడుగుతుంది.

"ఇంత చక్కని చుక్కని కని-నీకెందుకు దిగులు?"

"ఈ చక్కని చుక్క గురించే నండి ... దీని పెళ్ళి మాకో విడని చిక్కయి కూర్చుందండీ మామ్మగారూ." ఏమిటన్నట్లు ముఖం సాగదీసి చూసింది బామ్మ.

"ఈ చుక్కకి కొంచెం తిక్కకూడా ఉందండి. పెద్దలు....మీదగ్గర దాచక్కర లేదు...ఇది-పైకి ముంగిలా అమాయకంగా కనిపిస్తుంది కానీ మహా అసాధ్యురాలంటే నమ్మండి."

"ఏమీ"

"ఇప్పటికో పాతిక సంబంధాలు తిరక్కొట్టేసిందండి ..."

బామ్మ బంగారు బొమ్మవేపు చూసింది.

"నిజమేనా? నీకు పెళ్ళాడి పిల్లల్ని కని ఎత్తుకుని జోలపాట పాడాలని లేదూ?"- "ఆ యీడు వచ్చిందే నీకు!"

పెద్దాయన చటుక్కున కలగజేసుకున్నాడు. "ఆరోజుకోసమే మేమూ ఎదురు చూస్తున్నామండి ఎంతో యిదిగా. మరి.... దీనివన్నీ గొంతెమ్మకోరికలు- పెళ్ళికొడుకు మన్మధుడిలా ఉండాలంటుంది-"

ఇంక ఆగలేనట్లు—రోషంగా అంది బంగారు బొమ్మ. "మన్మధుడు కాదు. మనోజ్ కుమార్"

నేను త్రుళ్ళిపడ్డాను. నిద్రమత్తు వదిలిపోయింది. ఈ అమ్మాయి-చిత్రంగా-మనోజ్ కుమార్ ఫ్యానా! తమాషాగా వుందే.

"తప్పేముంది? అమ్మాయి అధిక చక్కనిది. మొగుడు అందగాడై వుండాలని కోరుకోడం సహజమే తప్ప నేరం కాదు." అమ్మాయిని దగ్గరగా తీసుకుంటూ అంది బామ్మ.

"అంతే అయితే బాధ లేదండి. అక్క-డితో ఆగిందా? కాబోయే మొగుడు కధ వ్రాయాలిట. క్రికెట్టాడాలిట. పాటలు పాడాలిట. డ్యాన్సు చేయాలిట. అతని అందముండాలిట. ఆస్తులుండాలిట. ఒక చేమిటండి. అతడు సకలగుణాభిరాముడై ఉండాలి. అటువంటివాడు భూమ్మీదుంటా డంటే నమ్మతేమండి. ఒకవేళ ఉన్నా-నే నివ్వగలిగే పదివేలకి దొరకడండి-" దీనంగా చెప్పాడా పిల్ల తాలూకు తండ్రి.

అమ్మాయి తక్కువ తిన్నట్లు లేదు "ఎందుకుండడేం? నేన్చదివిన నవలలలోనూ చూసిన సినిమాలలోనూ హీరోలందరూ అలాటివాళ్ళే. భూమ్మీదుండరనేస్తే నేన నమ్ముతానేమిటి"

నేను గతుక్కుమన్నాను. పెళ్లి చేస కునే ఆడపిల్లకిన్నేసి కోరికలుంటాయన మాట పెళ్లిమీదా పెళ్లికొడుకుమీదా నయమే. నేను చటుక్కుని తొందరప


100 ml బాటిలు కొని

**87 పైసలు ఆదా చేసుకోండి**

# 'క్రివేణి' ఇంకు




ఇప్పుడు లాభకరమైన ప్యాకింగులో
100ml పాలిథీన్ బాటిల్సులో దొరుకుతున్నది.
100ml బాటిలు 1కి వెల రు. 2-80
60ml బాటిలు 1కి వెల రు. 2-20
(స్థానిక పన్నులు అదనం)
వినియోగదార్ల లాభమునకుగాను ప్రకటించుచున్నాము.

తయారు చేయువారు :

**కృష్ణవేణి ఇంకు ఫ్యాక్టరీ**

751, తిరువత్తియూరు హైరోడ్, మద్రాసు-600081

# యథార్థం

ఒంటరి సాయంత్రాలు,
వెన్నెల నిమరగా
చల్లగా వీచే చెట్టుకొమ్మలు.
గొంతులు తడిపే చల్లని—
వేడి పానీయాలు
ఊహా లోకాల్లోకి నడిపించే
సంగీతాలు
దేవాలయాల్లో భజగోవిందాలు
క్లబ్బుల్లో డిస్కో- డాన్సుల
కేరింతలు
ఎంత మందికి అనుభవంలో
ఒక భాగం?
కొందరికి ఇదంతా యథార్థమే!
మరి మిగతా కోట్లాది మందికి
వెలుగు-చీకటి అంతా ఒకటే!!

**నిఖిల్**

పెళ్ళి చేసుకుందుకు సిద్ధపడిపోలేదు.

ఒక్కసారి బామ్మ ఘొల్లున నవ్వింది.

బంగారు బొమ్మని దగ్గరకు తీసుకుని. మరీ మరీ నవ్వింది. అలా నవ్వుతూనే-"ఒసి వెర్రిపిల్లా! పిచ్చిసన్నాసీ... నీ చిన్ని మనసులో ఎన్నెన్ని కోరికలే. నీ అమాయకత్వం బంగారం కానూ" అంటూ ఆ అమ్మాయి బుగ్గలు పుణికింది మునివేళ్ళతో.

"నావన్నీ కలలేనా?" అడిగింది అమ్మాయి బెదురుగా.

"కాదుకాదు. కలలు కాదు. నీ కలలు నిజమౌతాయి"

"ఎలా?" ఆశగా చూసింది.

బామ్మ గంభీరంగా అయిపోయిందొక్కసారి. ఓ నిముషం మౌనంగా-ఆలోచిస్తున్నట్లుండి-ఆలోచనా భంగిమ నవలంబించి-అప్పుడు యిలా అంది. "జాగ్రత్తగా విను. విన్నది మనసుకి పట్టించుకో. మన ఆడవాళ్ళకి పార్వతీదేవి ఓ వరమిచ్చింది. అదేమిటంటే-ఉన్నా లేకపోయినా ఊహలలో బతికెయ్యగలిగే సమర్థతా చాతుర్యమూ...."

"మనసు చంపుకోడమా?" అడ్డం తగిలింది పెళ్ళికాని పిల్ల.

"పెంచుకోమనే. చంపుకోమని కాదు. మొగుడెలాటివాడు కానీ మన కంటితో చూడ్డమూ మన మనసుతో తూచడమూ నేర్చుకుని అలవాటు చేసుకుంటే అంతా సుఖమే మనకి. ఆడజన్మకిది అత్యావసరమయిన లక్షణం. చూడగలిగిన కనులకు కురూపి భర్త కూడా నలకూబరుడే అవుతాడు. గుమాస్తా కూడా ఇంద్రుడే అనిపిస్తాడు. అతని తిట్లు కవిత్వంలా వినిపిస్తాయి. కోపిష్టి మొగుడు కూడా పరమ సాధుడిగా తోచి తీరుతాడు. అనగ నగ రాగ మతిశయిల్లదూ? తినగ తినగ వేము తీపి కాదూ? పాతిక రూపాయలకు కొన్న చీరను-పక్కింటావిడకు యాభై అని చెప్పి మురిసిపోగలిగే మనసు కాదూ ఆడమనసు? చీర గురించి అతిశయోక్తి చెప్పి ఆనందించగలిగే మనం-మొగుడి గురించి ఉన్నవీ లేనివీ చెప్పుకుని మురిసిపోవడం మాత్రం తప్పేమిటి? ..." ఇంకా ఏదో చెప్పింది బామ్మ బహు సీరియస్‌గా.

తాతగారి గురించి నా సందేహాలకు సమాధానాలు దొరికేశాయి

అమ్మ బామ్మా! నువ్వింత తెలివయినదానివా' అనుకున్నాను మనసులో.

చచ్చినవాడి కళ్ళే కాదు, బతికున్నవాడి కళ్ళూ చారెడే—అతగాడే ఆడదానికయినా భర్తయితే భారతదేశపు భర్త అత్యంత అదృష్టవంతుడు. ఇల్లాలి అంతరంగంలో అతను ఎప్పటికీ ది గ్రేట్!